ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

■ పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి
■ రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
■ సంబంధిత అధికారులతో సమీక్ష

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, మార్చి 1 (నమస్తేతెలంగాణ) : ప్రభుత్వ భూములను పరిరక్షించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధరణి సమస్యల పరిష్కారం, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం సెక్షన్ సూపరింటెండెంట్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా రక్షించాలన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోజువారీగా లక్ష్యాన్ని నిర్ణయించుకుని ఈ నెల 15లోపు పెండింగ్ లేకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా డివిజన్ల పరిధిలోని ప్రభుత్వ భూములపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సర్వేల్యాండ్ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రభుత్వ భూములను కాపాడేందుకు 15రోజుల డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి రాతి కడీలు, సూచిక బోర్డులు, కంచెలు ఏర్పాటు చేసి ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు కందుకూరు జగదీశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం అనంతరెడ్డి, చేవెళ్ల చంద్రకళ, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

రంగారెడ్డి, మార్చి 1 (నమస్తేతెలంగాణ) : జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయ భవనంలో ఇంటర్ పరీక్షలపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 5 నుంచి 25 వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదో రతగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్‌లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించామన్నారు. ఏర్పాటు చేసిన రూట్లల్లో రూట్ అధికారులను కేటాయించామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో అధికారులు తీసుకున్న శిక్షణను అనుసరించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు..

పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదని కలెక్టర్ అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను ముందుగానే మూసివేయించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణకు అమసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నిరంతర విద్యుత్, తాగునీరు ఉండేలా చూడాలని మూత్రశాలల సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నపత్రాలను పోలీసు ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యార్థులకు పరీక్షా ఫ్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్, హాల్‌టికెట్లను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ప్రతి సెంటర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించాలన్నారు. ప్రాథమిక చికిత్స కిట్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉండాలని, ఆశ వర్కర్లను నియమించాలన్నారు. అవసరమైన చోట ఏఎన్ఎంలను నియమించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షల సమయానికి అనుకూలంగా విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యానాయక్, డీఈవో సుశీందర్‌రావు, రాచకొండ, సైబరాబాద్, పోలీసు అధికారులు, పోస్టల్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

విమర్శలు మానండి.. నిజాలు తెలుసుకోండి

బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్, మార్చి 1 : తెలంగాణ అప్పుల మీద చౌకబారు విమర్శలు మాని... నిజాలు తెలుసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారితే కేసీఆర్‌ను విమర్శించకుండా బతకలేని తెలంగాణ కాంగ్రెస్ నాయకులారా వాస్తవాలను గ్రహించకుండా అడ్డగోలుగా విమర్శలు చేయడం మానుకుని.. కండ్లు తెరిచి నిజాలను చూడండని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ పాలనలో అప్పుల పాలు చేశారని సామాన్య జనాలను తప్పుదోవ పట్టించడానికి చేసే ప్రయత్నాలు ఇకనైనా మానుకోవాలని సూచించారు. భారతీయ సూచికల ప్రకారం విడుదల చేసిన జాబితాలో తమిళనాడు ప్రస్తుతం భారతదే శంలో అత్యధిక అప్పులను కలిగి ఉన్నదన్నారు. తరువాత స్థానంలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ఉందని తెలిపారు. పశ్చిమ బెంగాల్ , కర్ణాటక తదితర రాష్ట్రాలు కూడా గణనీయమైన అప్పు కలిగి ఉన్నాయని గుర్తు చేశారు. దేశంలో ఎక్కువ అప్పు కలిగి ఉన్న మొదటి పది రాష్ట్రాల జాబితాల్లో తెలంగాణ లేదని వివరించారు. కేసీఆర్ పాలనతో దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసులను వెంటనే పరిష్కరించాలి

వివిధ కుల సంఘాల నాయకుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఆదిబట్ల, మార్చి 1 : రంగారెడ్డి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం రంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశ మందిరంలో కలెక్టర్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ కుల సంఘాల నాయకుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులను నెల రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఏమాత్రం ఉపేక్షించబోమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, సీపీలకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని సూచించారు. అధికారులు ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను తరచూ తనిఖీ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యను అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే అధికారులపై కమిషన్ తరపున కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని భూసమస్యలపై ఆర్డీవోలతో విచారణ చేయించి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. సమావేశంలో డీసీపీలు శ్రీనివాస్, సునీతారెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, శంకర్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామారావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

వికారాబాద్, మార్చి 1 : మగ్గం పనిని నేర్చుకునేందుకు స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ యూనియన్ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో మగ్గం వర్క్ప్ర ోగ్రామ్‌లో శంషాబాద్ పరిధిలోని ముచ్చింతలలో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టులో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందేందుకు 19-45 ఏండ్ల వారు అర్హులన్నారు. ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఆధార్, రేషన్ కార్డుతో పాటు మూడు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు శిక్షణ పొందేందుకు రావాలని తెలిపారు. రాయడం, చదవడం తప్పనిసరిగా వచ్చి ఉండాలని తెలిపారు. మిగతా వివరాలకు 7893121143, 9391487797, 9177141712 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని ఆయన తెలిపారు.

దివ్యాంగులకు గుర్తింపు తప్పనిసరి

❑ ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం)కార్డు కోసం యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి ❑ సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్

వీసీకి హాజరైన అదనపు కలెక్టర్, తదితరులు

వికారాబాద్, మార్చి 1 : దివ్యాంగులకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్ సూచించారు. శనివారం సదరం క్యాంపులు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై కలెక్టర్లు, డీఆర్డీవో, డీడబ్ల్యూవో, డీసీహెచ్ఎస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్లతో సెర్ప్ సీఈవో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం)కార్డు కోసం యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాల కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేలా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు.

మొబైల్ ద్వారా రిజిస్ట్రేషన్..

గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ, వీఎల్ఈ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు వీటితోపాటు యూడీఐడీ పోర్టల్, సొంత మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్లు బుక్ చేసుకోవచ్చని సెర్ప్ సీఈవో తెలిపారు. క్యాంపుల వివరాలు మెసేజ్ ద్వారా తెలియజేయనున్నట్లు సూచించారు. ఈ ప్రక్రియను ఈ ఏడాది మార్చి నుంచి అమల్లోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. 21 రకాల వైకల్యం కలిగిన వారు యూడీఐడీ (యూనిక్ డిజాబిలిటీ ఐడీ) కార్డును పొందవచ్చని ఆమె తెలిపారు. సదరం కార్డును కూడా పోస్టల్ ద్వారా అభ్యర్థులకు చేరవేయనున్నట్లు తెలిపారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, వారికి ప్రస్తుతం ప్రభుత్వ పరంగా అందుతున్న పథకాలు వర్తిస్తాయన్నారు. దివ్యాంగులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

38 మెడికల్ బోర్డుల గుర్తింపు

రాష్ట్రంలో సదరం క్యాంపులను నిర్వహించేందుకు 38 మెడికల్ బోర్డులను గుర్తించామని సెర్ప్ సీఈవో తెలిపారు. సదరం క్యాంప్ నిర్వహించే సందర్భాల్లో దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకునే విధానంపై మీసేవ నిర్వాహకులకు శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. పీఎం కుసుం ప్రాజెక్ట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామీణ మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్నారు. ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఉమాహారతి, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామచంద్రయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటినే తాగాలి

● రూ. 8.126 కోట్ల ఇంటి పన్నులు వసూలు
● వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ

సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో జయసుధ

బషీరాబాద్, మార్చి 1 : మిషన్ భగీరథ నీటిని తాగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో రూ.9.56 కోట్ల ఇంటి పన్నులు లక్ష్యంగా ఉంటే, ఇప్పటివరకు రూ.8.126 కోట్ల పన్నులు వసూలు చేశాన్నారు. జిల్లాలో 16,229 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయని, రెండు నెలల్లో వాటిని పూర్తి చేస్తామన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు చాలా రుచిగా ఉంటాయని, వాటిని తాగేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని, వాటి ప్రాముఖ్యత తెలియజేయాలన్నారు. మంచినీటి పైపులైన్లు, మోటర్ల మరమ్మతులు ఉంటే చేయించాలని తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేరని ప్రజలకు ఏ ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీ రికార్డులు, ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో శయకర్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో అంతర్జాతీయ క్రీడలు నిర్వహించేందుకు కృషి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, మార్చి 1: షాబాద్‌లో అంతర్జాతీయ క్రీడలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్‌లోని పీఆర్ఆర్ స్టేడియంలో దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి రాజేందర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారం రోజులుగా రాజేందర్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్‌లో మొదటి బహుమతి శంకర్‌పల్లి జట్టుకు రూ.2లక్షల నగదు, రెండోబహుమతి చేవెళ్ల జట్టుకు రూ.లక్ష నగదు, వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి మొయినాబాద్ జట్టుకు రూ.30వేల నగదు, రెండో బహుమతి షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం జట్టుకు రూ.15వేల నగదుతో పాటు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ మాట్లాడుతూ... శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు దగ్గర్లో ఉన్న ఈ ప్రాంతం రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... పార్టీలకతీతంగా రాజేందర్‌రెడ్డి వర్ధంతి, జయంతి వేడుకల్లో అన్ని పార్టీల నాయకులు, అభిమానులు పాల్గొనడం సంతోషకరమన్నారు. మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ...క్రీడాపోటీలతో గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పాడుతాయని తెలిపారు. తన తండ్రి దివంగత రాజేందర్‌రెడ్డి పేరుపై ప్రతి ఏడాది క్రీడాపోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు నర్సింగ్‌రావు, చల్లా శ్రీరాంరెడ్డి, సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జడల రాజేందర్‌గౌడ్, నక్క శ్రీనివాస్‌గౌడ్, శేరిగూడెం వెంకటయ్య, పోన్న నర్సింహారెడ్డి, కొలన్ ప్రభాకర్‌రెడ్డి, క్రీడల నిర్వాహకులు మహేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా, పార్టీ మండల నాయకులు వెంకట్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, మంగలి సత్యం, కుమ్మరి దర్శన్, మద్దూరి పాండు, రాజేందర్‌రెడ్డి, ముఖ్రంఖాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఇమ్రాన్, దయాకర్‌చారీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధిస్తేనే పురోగతి

యూనివర్సిటీ ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి

కళాశాలలో నిర్వహించిన సదస్సులో సావనీరును ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

మొయినాబాద్, మార్చి 1: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధిస్తేనే సమాజం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ రీసర్చ్, సౌత్ రీజినల్ సెంటర్ (ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్సీ) డైరెక్టర్ ప్రొఫెసర్ బి సుధాకర్‌రెడి అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ దక్షిణ ప్రాంత కేంద్రం హైదరాబాద్ సహకారంతో గ్రామీణ మహిళల సాధికారత విధానాల వ్యూహాలు, ఫలితాలపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 60 మందికి పైగా ప్రముఖ నిపుణులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే మహిళా సాధికారత సంపూర్ణంగా సాధించిన వాళ్లమవుతామన్నారు. రాష్ట్రాల్లో సామాజిక శాస్త్రాల పరిశోధనలు ప్రోత్సహించేందుకు, అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా ఐసీఎస్ఎస్ఆర్ పని చేస్తుందని చెప్పారు. ఈ కేంద్రం సాంకేతిక సామాజిక ఆర్థిక రంగాల్లో పరిశోధన పెంచడం, విద్య, శిక్షణ సౌలభ్యాలు అందించడం, సామాజిక సంక్షేమానికి సంబంధించిన విధానాలను బలపర్చడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. అలాగే సామాజిక అభివృద్ధి, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన, ఆరోగ్య, విద్య, ఇతర సామాజిక అంశాలపై పరిశోధనలు పాలన మార్గదర్శకాలపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

అవగాహన కల్పించాలి

జేఎన్‌టీయూ యూనివర్సిటీ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ డైరెక్టర్ డాక్టర్ సింధు మాట్లాడుతూ గ్రామీణ మహిళా సాధికారత సాధించాలంటే ప్రభుత్వాలతో పాటు విద్యా సంస్థలు కూడా పరిశోధనలు చేయాలని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి వస్తున్న సమస్యలను అధిక మించడానికి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జాకబ్ కళ్లె, ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంతి ప్రొఫెసర్ సూర్యనారాయణ, అర్కిటెక్ట్ ననీవదేకర్, డాక్టర్ సుగంధ ఆచార్యులు, వీ హబ్ డైరెక్టర్ యాన్ని విజయ, కళాశాల ప్రధానాచార్యులు సాయి సత్యనారాయణరెడ్డి, అబ్దుమిక్స్ డీన్ డాక్టర్ నర్సయ్య, పరిశోధన విభాగం డీన్ డాక్టర్ జయహరి, విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ ఉదయ శ్రీ, ఎంబీఏ విభాగ అధిపతి సి చందన, సదస్సు కన్వీనర్లు డాక్టర్ సుచీశ్వేత, డాక్టర్ సారిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫార్మా బాధిత రైతులకు అండగా ఉంటాం

సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

యాచారం, మార్చి 1 : ఫార్మా బాధిత రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీకి ఇవ్వని 2,200ల ఎకరాల పట్టా భూములను ఆన్‌లైన్‌లో టీఎస్ఐఐసీ తొలగించి రైతుల పేర్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ సర్కార్‌కు చీమ కుట్టినట్లయినా లేకపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రైతుభరోసా, రైతు బీమా, పంట రుణం వర్తించేలా చూడాలన్నారు. రైతుల భూములు తిరిగి వారికి ఇచ్చేవరకు పోరాడుతామన్నారు. అవసరానికి అమ్ముకునేలా రిజిస్ట్రేషన్ చేసుకునే వసతిని కల్పించాలన్నారు. రైతుల అసైన్డ్ భూములకు ప్రభుత్వం పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు కమిషన్ వైర్మన్ కోదండరెడ్డి గత ప్రభుత్వ హయాంలో రైతులతో తిరిగి, ఆందోళనలు చేసి పదవి రాగానే రైతులను విస్మరించడం తగదన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. రైతుల సమస్యలపై రైతు సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు తావునాయక్, బుగ్గరాములు, భాషయ్య, శ్రీశైలం, సత్తయ్య తదితరులున్నారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు..

పెద్దేముల్, మార్చి 1 : కట్టుకున్నోడే భార్యను హతమార్చిన ఘటన మండల పరిధిలోని హన్మాపూర్‌లో జరిగింది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు..కర్ణాటక రాష్ట్రంలోని చించోలి తాలుకా పరిధిలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన నాగప్ప కూతురు కల్పనను పెద్దేముల్ మండల పరిధిలోని హన్మాపూర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చి 9 ఏండ్ల క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో మూడు తులాల బంగారం, రూ.50వేలు కట్నం ఇచ్చారు. పలుమార్లు అదనపు కట్నం కోసం వేధిస్తే నాగప్ప రూ.60వేలు ఇచ్చారు. కొన్ని నెలల క్రితం ఇలాగే హింసిస్తే నాగప్ప పెద్ద కుమారుడు ఆమెను పుట్టింటికి తీసుకొచ్చారు. కొన్ని రోజుల తర్వాత భార్యను తీసుకెళ్లడానికి వచ్చిన సమయంలో గ్రామంలో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఆ సమయంలో భార్యను బాగా చూసుకుంటానని ఒప్పుకొన్నాడు. ఆ తర్వాత తాగుడుకు బానిసై భార్యను కొట్ట